క్లుప్తంగా

పారిశుద్ధ్య మెరుగుకు చర్యలు చేపట్టాలి



తెనాలిఅర్బన్: పట్టణంలోని పారిశుద్ధ్య మెరుగుదలకు అనేక చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పట్టణంలోని 8,9 వార్డులలో సోమవారం ఉదయం ఆమె పర్యటించారు. ఆ వార్డుల్లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రణాళికాబద్ధంగా స్పెషల్ శానిటేషన్ వర్క్‌లను చేస్తున్నట్లు చెప్పారు. నూరుశాతం చెత్తసేకరణే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు, టీపీవో సాంబశివరావు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్లను తొలగించండి



తెనాలిఅర్బన్: బాలాజీరావుపేట చక్రవర్తి స్కూల్ వీధిలో రెండు మామిడిచెట్లు రోడ్డుకు అడ్డంగా ఉన్నాయని, వీటి వలన వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయని, వాటిని తొలగించాలని ఆ ప్రాంతవాసి మూల్పూరు వీర వర్ధనరావు మున్సిపల్ అధికారులను కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. చినరావూరు రైల్వేగేటు నుంచి స్మశానికి వెళ్ళే రోడ్డును నిర్మిస్తూ అడ్డుగా పలు భారీ వస్తువులను ఏర్పాటు చేశారని వాటిని తొలగించాలని ఆ ప్రాంతవాసి ఇన్‌ఛార్జి కమిషనర్ వీఎం.లక్ష్మీపతిరావుకు వినతి పత్రం ఇచ్చారు. వీటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

కౌన్సిలర్లు అంటే అంత అలుసా?

- వార్డుల్లో జరిగే పనులు కౌన్సిలర్లకు తెలియజేయరా?
- పద్ధతి మార్చుకోవాలంటూ అధికారులకు చైర్‌పర్సన్ హెచ్చరిక
- ముగిసిన తెనాలి కౌన్సిల్ సమావేశం



అధికారులను నిలదీస్తున్న వైస్ చైర్మన్ హరిప్రసాద్, కౌన్సిలర్ రామయ్య. (ఇన్‌సెట్‌లో) సమావేశానికి అధ్యక్షత వహించిన చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: పట్టణంలోని వార్డుల్లో చేసే గ్యాంగ్ వర్కు, పంటకాల్వల పూడికతీత పనులను ఎందుకు కౌన్సిలర్లకు తెలియజేయరు? మీకు కౌన్సిలర్‌లు అంటే లెక్కలేదా? ప్రజాప్రతినిధులకు అధికారులు ఇచ్చే గౌరవం ఇదేనా అంటూ వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ఇది మంచి పద్ధతి కాదని, మరోసారి అధికారులు ఇలా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని సోమవారం కౌన్సిల్ హాల్‌లో నిర్వహించారు. సమావేశానికి చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షత వహించారు. మొదటి అంశం చదవటం పూర్తికాగానే టీడీపీ కౌన్సిలర్ అడుసుమల్లి వెంకటేశ్వరరావు లేచి పట్టణంలోని పలు అభివృద్ధి పనులకు టెండర్లు పిలుస్తున్నారు. కానీ ఒక్కపని కూడా కాంట్రాక్టర్‌లు ప్రారంభించటం లేదని, అలాంటప్పుడు టెండర్లు పిలవటం దేనికని ప్రశ్నించారు. బిల్లుల చెల్లింపులు నిలచిపోవటం వల్ల పనులు చేసేందుకు కాంట్రాక్టర్‌లు ముందుకు రావటం లేదని చైర్‌పర్సన్ తెలిపారు. దీనివల్ల పనులలో జాప్యం జరుగుతుందన్నారు. దీనిపై కూడా కౌన్సిల్‌లో చర్చ జరిగే విధంగా చూడాలన్నారు.

వైస్ చైర్మన్ కూడా స్పందించరా?

ఇటీవల పట్టణంలోని మంచినీటికి సరఫరాలకు సంబంధించిన సమస్యను ఏఈకి తెలియజేశా. పది రోజులు దాటినా దానిపై స్పందించ లేదు. దీంతో నా సొంత నిధులతో పనిచేయించానంటూ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. కౌన్సిల్‌లో కుర్చీ ముందు, కారుపై వైస్ చైర్మన్ అనే బోర్డును పెట్టుకోడానికి మినహా దేనికి ఈ పదవి పనికి రావటం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. వైస్ చైర్మన్ అని చెప్పుకోవడానికి సిగ్గుగా ఉందంటూ అసహనం వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన చైర్‌పర్సన్ ఏఈ సూరిబాబును మందలించి మరోసారి ఇలా జరకుండా చూడాలని సూచించారు.

మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పిన పనులు కూడా చేయరా?

40వ వార్డులో మంత్రి నాదెండ్ల మనోహర్ పర్యటించిన సమయంలో రెండు అభివృద్ధి పనులు చేయాలని అధికారును ఆదేశించారు. వాటిని కూడా ఇప్పటి వరకు ప్రారంభించలేదని వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు వైస్ చైర్మన్‌లు అంటే విలువలేదు. కనీసం మంత్రి ఆదేశాలకు కూడా విలువ ఇవ్వారా అంటూ అసహనం వ్యక్తం చేశారు. తన వార్డులో ఇప్పటి వరకు ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదని, వెంటనే చేయించే విధంగా చూడాలని చైర్‌పర్సన్‌ను కోరారు. అలాగే పలువురు కౌన్సిలర్‌లు తమ వార్డులోని సమస్యలు ప్రస్తవించి వాటిని త్వరగా పూర్తి చేయాలని కోరారు. అజెండాలోని 24 అంశాలు ఆమోదిస్తున్నట్లు చైర్‌పర్సన్ రాధిక ప్రకటించారు. సమావేశంలో ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు, ఎంఈ శ్రీకాంత్, మేనేజర్ విల్సన్ జయకర్, ఆర్‌వో రాంప్రసాద్, ఎసీపీ శివన్నారాయణ, పలువురు అధికారులు, కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాద కారకులకు జరిమానా

తెనాలిరూరల్: బైక్‌తో ఢీ కొట్టి వ్యక్తి వృతికి కారణమైన వ్యక్తితో పాటు లైసెన్సు లేని వ్యక్తికి బైక్ ఇచ్చిన వాహన యజమానికి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొల్లిపర మండలం చివలూరు గ్రామానికి చెందిన లూథర్ 22020 మే 10న బహిర్భూమికి వెళ్లి తిరిగి వస్తుండగా మోర్ల శివగోపి కృష్ణంరాజు పల్సర్ బైక్‌పై వచ్చి ఢీ కొట్టడంతో కిందపడ్డాడు. అదే సమయంలో ఎదురుగా వచ్చిన మరో బైక్ ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని తెనాలిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. కేసును కొల్లిపర పోలీసులు నమోదు చేశారు. కేసు సోమవారం విచారణకు రాగా సాక్షాధారాలు పరిశీలించిన రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి. రాజశేఖర్, బైక్ నడిపిన కృష్ణం రాజుకు రూ. ఐదు వేలు జరిమానా విధించారు. అలానే లైసెన్సు లేని వ్యక్తికి బైక్ ఇచ్చినందుకు వాహన యజమాని మన్నెం వెంకట శివకు రూ. ఐదు వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఏసును అప్పటి కొల్లిపర ఎస్‌ఐ బలరాంరెడ్డి నమోదు చేసి చార్జిషీటు దాఖలు చేయగా, ప్రాసిక్యూషన్ తరపున సీనియర్ ఏపీపీ పరిశపోగు సునీల్‌కుమార్ వాదించారు.

వ్యర్థాల తొలగింపునకు వినతి

తెనాలి: పట్టణంలోని కీలకమైన పంటకాల్వల్లోంచి తీసిన గుర్రపుడెక్క, తూటాకు, ఇతర వ్యర్థాలను రోడ్డుపై పడేయటం వల్ల రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా ఉందని ది తెనాలి పట్టణ, పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం తెలియజేసింది. వెంటనే తొలగించేలా ఆదేశించాలని కోరింది. ఆ ప్రకారం సంఘం అధ్యక్షుడు దరిశి శివకోటేశ్వరరావు, అబ్దుల్ ఆరీఫ్, కొమ్ము అబ్రహం లింకన్, సాతులూరి రాజేష్, కొల్లిపర బాబు ప్రసాద్ సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం సమర్పించారు. ముఖ్యంగా స్థానిక వీఎస్ఆర్ కాలేజి నుండి వైకుంఠపురం రైల్వేవంతెన వరకు పడమర కాల్వలోని వ్యర్థాలను టన్నులకొద్దీ రోడ్డుపై వేశారని తెలిపారు.

వెద పద్ధతిలో వరి సాగు ప్రారంభం

కొల్లిపర; మండల పరిధిలోనే రైతులు వరిసాగు ప్రారంభించారు.వెద్ద పద్ధతిలో వరి సాగు చేసేందుకు రైతులు ప్రస్తుతం వరి విత్తనాలు నేరుగా భూమిలో చల్లే పనిలో నిమగ్నమవుతున్నారు. ప్రస్తుతం వర్షా భావం తక్కువ గా ఉండటం వలన వెద పద్ధతిలో సాగు చేసే వరికి నీటి అవసరం తక్కువగా ఉండటంతో అధికంగా రైతులు వెద పద్ధతికి మొగ్గుచూపుతున్నారు. తెనాలి నియోజక వర్గంలో సుమారుగా 30వేల ఎకరాల్లో వరి సాగు జరుగుతుండగా సుమారు 25 వేల కరాలల్లో రైతులు వెద పద్ధతిలో సాగు చే పడుతున్నారు.వెద పద్ధతిలో సాగు చేసిన వరికి నీరు ఆరుతడి పంటలకు అందజేసిన పద్ధతిలో అందజేసే వెసులుబాటు ఉండటంతో పాటు అధిక దిగుబడులు ఆశా జన కంగా ఉండటంతో రైతులు వెద్ద పద్ధతిలో సాగుకు సిద్ధపడుతున్నారు.

జాగర్లమూడిలో పౌరహక్కుల దినోత్సవం



గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలిరూరల్: మండలంలోని సంగంజాగర్లమూడి గ్రామంలో పౌరహక్కుల దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. తహసీల్దార్ కేవీ గోపాల కృష్ణ, ఎంపీడీవో అత్తోట దీప్తి పాల్గొని స్థానికులతో మాట్లాడారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రస్తుత నాగరిక సమాజంలో కుల పంచాయతీలకు తావులేదని, ఏదైనా ఇబ్బంది తలెత్తితే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరికి రాజ్యాంగం కొన్ని హక్కులను కల్పించిందని వాటి గురించి అవగాహన పెంచుకుని స్వేచ్ఛగా జీవించాలని చెప్పారు. అలానే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

మద్యం తాగి రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తికి జరిమానా

తెనాలిరూరల్: మద్యం మత్తులో బైక్ నడిపి రోడ్డు ప్రమాదంలో మహిళ తీవ్ర గాయాపాలు చేసిన వ్యక్తికి న్యాయమూర్తి జరిమానా విధించారు. బాపట్ల జిల్లా కొల్లూరు మండలం సుగ్గున లంకకు చెందిన చెన్నకేశవుల రాధాకుమారి 2021 జనవరి తొమ్మిదో తేదీన తెలిసిన వారి బైక్‌పై స్వగ్రామానికి వెళుతుండగా వేమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఎదురుగా వచ్చిన బైక్ ఢీ కొట్టడంతో రాధాకుమారి తీవ్రగాయాలపాలైంది. ప్రమాదానికి కారణమైన గాలి విజయ్‌మద్యం మత్తులో వాహనాన్ని నడిపినట్టు పోలీసులు గుర్తించి కేసు నమోదు చేశారు. కేసు సోమవారం విచారణకు రావడంతో సాక్షాధారాలను పరిశీలించిన రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి. రాజశేఖర్ నిందితుడికి రూ. ఎనిమిది వేలు జరిమానా విధించారు. లైసెన్సు లేని వ్యక్తికి వాహనాన్ని ఇచ్చినందుకు బైక్‌యజమాని గాజుల దీపారాణికి రూ. ఏడు వేల జరిమానా విధించారు. కేసులో అప్పటి వేమూరు ఎస్‌ఐ లోకేశ్వరరావు చార్జిషీటు దాఖలు చేయగా, ప్రాసిక్యూషన్ తరఫున సీనియర్ ఏపీపీ పరిశపోగు సునీల్‌కుమార్ వాదనలు వినిపించారు.

అంగన్వాడి ఉద్యోగులను స్కీం వర్కర్లుగా గుర్తించాలి



మాట్లాడుతున్న శివసాంబిరెడ్డి

కొల్లిపర: అంగన్వాడీ ఉద్యోగులను స్కీం వర్కర్లుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరుతూ జులై 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెలో అంగన్వాడీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్ని సభను జయప్రదం చేయాలని సీఐటీయూ తెనాలి డివిజన్ కార్యదర్శి షెక్ హుస్సేన్ వల్లి కోరారు. సమ్మె ప్రచారంలో భాగంగా సోమవారం మండలంలోని తూములూరు, కొల్లిపర గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాలల్లో సమావేశాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి అంగన్వాడీలు వారి సమస్యలపై ప్రభుత్వం పై ఐక్యంగా ఉంది పోరాడితేనే తద్వారా గతంలో కొన్ని హక్కులు సాధించుకోవడం జరిగిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్ అమలు అయితే సంఘం పెట్టుకునే హక్కు సమ్మె చేసే హక్కు ఉండదని వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని తెలుపుతూ జులై 9 న జరిగే దేశవ్యాప్త సమ్మెలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సీఐటీయూ రైతు వ్యవసాయ కార్మిక సంఘాలు మద్దతుతో 9వ తేదీన ఉదయం 9 గంటలకు కొల్లిపర అంబేద్కర్ విగ్రహం నుంచి ర్యాలీ ప్రారంభమై తహసీల్దార్ కార్యాలయం వరకు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

తెనాలిరూరల్: స్థానిక రామలింగేశ్వరపేటలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మహమ్మద్ కుద్దూస్, వంగా సాంబిరెడ్డి. కౌన్సిలర్లు అడుసుపల్లి వెంకటేశ్వరరావు, పసుపులేటి త్రిమూర్తులు, అశోక్, కోట రమేష్, రాజేష్, గోపి, పాల్గొన్నారు.



ఆంధ్రాప్యారిస్‌లో సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలు



తెనాలి: ఆంధ్రాప్యారిస్‌గా గుర్తింపును పొందిన తెనాలిలో ప్రైవేటు వైద్యరంగం నానాటికీ విస్తరిస్తోంది. ప్రస్తుతం స్పెషలిస్టు వైద్యసేవలతో సహా అత్యవసర వైద్యం అందుబాటులోకి వచ్చింది. గుండె ఆపరేషన్లు మినహా అన్ని స్పెషలిస్టు విభాగాలకు చెందిన నాణ్యమైన వైద్యసేవలు తెనాలి ప్రాంత ప్రజలు పొందగలుగుతున్నారు.

ఉమ్మడి తెనాలి డివిజన్ కేంద్రంగా దీర్ఘకాలం కొనసాగిన తెనాలి పట్టణం వివిధ రంగాలతోపాటు వైద్యరంగంలోనూ ఘనకీర్తిని సాధించింది. మిలటరీలో పనిచేసిన వైద్యుడు డాక్టర్ కాకుమాను వ్యక్కి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, తెనాలి శాఖకు తన ఆసుపత్రి భవనాన్ని విరాళంగా ఇవ్వటమే కాదు...అప్పట్లోనే గుంటూరు మెడికల్ కాలేజికి పరిశోధనల నిమిత్తం తన దేహాన్నీ దానం చేయటం అప్పట్లో ఒక సంచలనం. ఆయన అస్థిపంజరం ఇప్పటికీ మెడికల్ కాలేజీలో వైద్యవిద్యార్థుల విద్యకు ఉపయోగపడుతోంది. గాంధీయిజాన్ని మాటల్లోనే కాకుండా చేతల్లో చూపిన వెంపటి సూర్యనారాయణ మూర్తి లక్షకు పైగా ఆపరేషన్లను చేసిన ఘనుడు. శాస్త్రసాంకేతిక విజ్ఞానం తగినంతగా అభివృద్ధి చెందకున్నా, తమ విజ్ఞానం, మేధస్సుతో రోగుల మనసు గెల్చుకున్నారు. అలాంటి మహనీయుల వారసత్వంగా ఎందరో వైద్యులు తమ పరిధిలో రోగులకు వైద్యసేవలు అందిస్తూ వచ్చారు.

ప్రస్తుతం వైద్యవిజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందింది. ఆధునిక యంత్ర పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. ఆ క్రమంలోనే మినీ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్స్ తెనాలిలో వెలుస్తున్నాయి. యాక్సిడెంట్లు, ఇతర ప్రమాదాల్లో క్షతగాత్రులను గతంలో గుంటూరు, విజయవాడకు తరలించాల్సి వచ్చేది. ప్రస్తుతం తెనాలిలోనే ఆ సేవలను అందుబాటులోకి వున్నాయి. చిన్నపిల్లల వైద్యం, ఎముకలు, కీళ్ల వైద్యం, గాస్ట్రో ఎంటరాలజీ, కంటి వైద్యం, గైనకాలజీ వంటి విభాగాల్లో నిపుణులైన వైద్యులు హాస్పటల్స్‌ను నిర్వహిస్తున్నారు. ఎలాంటి స్పెషలిస్టు వైద్యానికైనా ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పనిలేదన్నట్టుగా అన్ని సేవలను రోగులు సద్వినియోగం చేసుకుంటున్నారు. గుండెపోటు సంభవించినపుడు తొలి గంటలో చేయించాల్సిన వైద్యం కూడా ఇక్కడే పొందుతున్నారు. గుండె, మెదడు ఆపరేషన్లు మినహాయిస్తే దాదాపు వైద్యసేవలన్నీ ఇక్కడే లభ్యమవుతున్నాయి.

కవిరాజ పార్కులో వనమహోత్సవం



తెనాలి: పర్యావరణం పరిరక్షణలో భాగంగా పట్టణ నందులపేటలోని కవిరాజ మున్సిపల్ పార్కులో సోమవారం మేత్ర నాగరాజు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, మండల తహశీల్దార్ కేవీ గోపాలకృష్ణ, మునిసిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ లక్ష్మీపతి ఈ కార్యక్రమానికి హాజరై మొక్కలు నాటారు. మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ మాట్లాడుతూ, మొక్కలను పెంచటం ద్వారా మనందరం పర్యావరణాన్ని పరిరక్షించగలిగితే ప్రకృతి ప్రజలకు తగిన రక్షణనిస్తుందని చెప్పారు. వార్డు కౌన్సిలరు కొత్రపాటి లక్ష్మి, స్థానిక పెద్దలు పాపి రెడ్డి. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ. కొరప్రాటి శ్రీనివాస్, దాసరి మారుతి శంకర్, బెల్లంకొండ మోహన్ రావు. మున్సిపల్, శానిటేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.